‘సోషల్’ బానిసలుగా విద్యార్థులు

ముదిరిపోయిన సెల్‌ఫోన్ వ్యసనం

82% మంది సోషల్ మీడియాకే అంకితం • 34% మంది వద్ద సొంత స్మార్ట్‌ఫోన్లు

విద్యకు వినియోగించేవారు తక్కువే • ఏఎస్ఈఆర్ నివేదికలో వేదు నిజాలు

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): పాఠశాల విద్యార్థుల్లో సెల్‌ఫోన్ వ్యసనం ముదిరిపోయింది. వారిలో చాలా మంది సోషల్ మీడియా మోజులో చిక్కుకుపోయారు. 14-16 ఏండ్ల మధ్య వయస్కుల్లో ఏకంగా 82% మంది తమ స్మార్ట్‌ఫోన్లను సోషల్ మీడియా కోసమే ఉపయోగిస్తున్నారు. వయసులవారీగా చూస్తే.. 14 ఏండ్ల వయస్సుల్లో 79% మంది, 15 ఏండ్ల వయస్కుల్లో 82.2% మంది, 16 ఏండ్ల వయస్కుల్లో 82.5% మంది సోషల్ మీడియాలో మునిగిపోతున్నట్టు వార్షిక విద్యాస్థాయి నివేదిక (యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు) వెల్లడించింది. 14-16 ఏండ్ల వయస్కులు విద్యకు సంబంధించిన విషయాలను తెలుసుకునేందుకు స్మార్ట్‌ఫోన్లను అంతంత మాత్రంగానే ఉపయోగిస్తున్నట్టు ఈ నివేదిక తేల్చింది.

బాలురే స్మార్ట్

- బాలికలతో పోల్చితే బాలురే అధికంగా స్మార్ట్‌ఫోన్లను, సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నట్టు ఏఎస్ఈఆర్ వెల్లడించింది.
- రాష్ట్రంలోని 96% మంది విద్యార్థుల ఇండ్లల్లో స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. 97% మంది బాలురు, 94%మంది బాలికల ఇండ్లల్లో స్మార్ట్‌ఫోన్లు ఉన్నట్టు తేలింది.
- సామాజిక మాధ్యమాల నుంచి రక్షణ పొందే విషయమై విద్యార్థులకు అవగాహన బాగానే ఉన్నది. ఖాతాను బ్లాక్ చేయడంపై 67.2% మంది, పాస్‌వర్డ్ మార్చడం 62% మంది, ప్రొఫైల్‌ను గోప్యంగా ఉంచుకోవడంపై 60.8% మంది విద్యార్థులు అవగాహన కలిగి ఉన్నారు.
- చదువు కోసం స్మార్ట్‌ఫోన్లను వాడుతున్న విద్యార్థులు 61.1% మందే. బాలురలో 60.7%, బాలికల్లో 61.5% మంది చదువుల కోసం స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తున్నారు.
- విద్యార్థుల్లో 34.3% మందికి సొంత స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. బాలురలో 39% మంది, బాలికల్లో 29% మంది సొంత స్మార్ట్‌ఫోన్లను కలిగి ఉన్నారు.
- వయసులవారీగా చూస్తే.. 16 వయస్కుల్లో 46.3%, 15 ఏండ్ల వయస్కుల్లో 29%, 14 ఏండ్ల వయస్కుల్లో 31.11% మంది స్మార్ట్‌ఫోన్లను కలిగి ఉన్నారు.
- విద్యార్థుల్లో 88.6% మంది యాట్యూబ్‌లో వీడియోలను వీక్షించేందుకు, 89% మంది అలారమ్ కోసం, 84.4% మంది సమాచార సేకరణ కోసం స్మార్ట్‌ఫోన్లను వాడుతున్నట్టు చెప్పారు.

మంచినీటి బావిలో వేడినీళ్లు

దండేపల్లి, జనవరి 29 : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మాదాపూర్‌లో ఆవునూరి మధుకర్‌కు సంబంధించిన మంచినీటి బావిలో నీళ్లు పొగలు కక్కుతున్నాయి. చుట్టుపక్కల బావులలో చల్లగా ఉంటున్నప్పటికీ ఈ బావిలో వేడి నీళ్లు రావడంపై గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఐదారు రోజులుగా ఇలాగే రావడంతో బావికి ఉన్న విద్యుత్ మోటర్‌తో పాటు విద్యుత్ కనెక్షన్ తొలగించారు. అయినప్పటికీ పొగలు కక్కుతూ వేడినీరు వస్తున్నది. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఈఏ అస్మితను వివరణ కోరగా ఆ నీటి శాంపిల్స్ మంచిర్యాల కార్యాలయానికి పంపినట్టు తెలిపారు.

‘కగార్’ను తక్షణమే నిలిపివేయాలి

- ఎన్‌కౌంటర్లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- న్యాయస్థానాలు సుమోటోగా విచారణ చేయాలి
- ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే
- కగార్‌పై నిర్వహించిన సదస్సులో మేధావులు, వక్తలు

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే కూనంనేని, ప్రొఫెసర్ హరగోపాల్, సీనియర్ సంపాదకులు కే శ్రీనివాస్ సీపీఐ నాయకురాలు పశ్యపద్మ తదితరులు

హైదరాబాద్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ ప్రాంతంలో కొనసాగిస్తున్న ‘ఆపరేషన్ కగార్’ను తక్షణమే నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని వామపక్ష నాయకులతోపాటు పలువురు మేధావులు డిమాండ్ చేశారు. అక్కడ జరుగుతున్న ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించి, దోషులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ‘నక్సల్స్ పట్ల కేంద్రప్రభుత్వ రాక్షస విధానాలను ఖండిద్దాం.. ప్రశ్నించే గొంతుకలను కాపాడుకుందాం’ అనే అంశంపై సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సదస్సు నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కే నాగేశ్వర్, మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ సంపాదకులు కే శ్రీనివాస్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్, వామపక్షాల నాయకులు డీజీ నరసింహారావు, చలపతిరావు, మురహరి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. దేశంలో పరిస్థితులు దారుణంగా మారుతున్నాయని.. మాట్లాడినా, ప్రశ్నించినా అణచివేస్తున్నారని, నిర్బంధ వాతావరణం నెలకొన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. బస్తర్ ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తామని, అడ్డొస్తే చెట్లతోపాటు మనుషులను కూడా తొలగిస్తామని ఛత్తీస్‌గఢ్ సీఎం మాట్లాడటం ఆందోళనకరమని పేర్కొన్నారు. రాజ్యం చట్ట బద్ధమైన హద్దులు దాటి బలప్రయోగ శక్తి వందరెట్లు పెరిగిందని తెలిపారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. మావోయిస్టుల తరపున గొంతును వినిపిస్తామని స్పష్టం చేశారు. నక్సల్స్ పేరుతో ప్రజలను, ప్రశ్నించే వారిని చంపితే ఉరుకోబోమని హెచ్చరించారు. మావోయిస్టులు ప్రజల కోసం అడవిలో పనిచేస్తుంటే.. అమిత్ షా మాత్రం పెట్టుబడిదారుల కోసం ప్రజల మధ్య ఉంటూ ప్రజలనే చంపిస్తున్నారని ఆరోపించారు. 2026 మార్చి నాటికి దేశంలో ఒక్క మావోయిస్టు కూడా లేకుండా చేస్తామని అమిత్ షా చేసిన ప్రకటనపై ఆగ్రహం వ్యక్తంచేశారు. విప్లవ కళాకారులు, సమాజాన్ని ప్రశ్నించే ప్రతిఒక్కరూ కమ్యూనిస్టులేనని శ్రీశ్రీ, దాశరథి లాంటివారు చెప్పారని గుర్తుచేశారు.

నాయనమ్మ కండ్లలో ఆనందం కోసమే హత్య

సూర్యాపేట, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేటలో కలకలం రేపిన కులోన్మాద హత్యలో విస్తుగొలిపే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నాయనమ్మ కండ్లలో ఆనందం కోసమే మనుమండ్లు ప్రేమ పెండ్లి చేసుకున్న సోదరి భర్త కృష్ణను అతి కిరాతకంగా హత్య చేసినట్టు తేలింది. ఆ తరువాత కారులో శవాన్ని 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న నాయనమ్మ దగ్గరికి తీసుకెళ్లి చూపించి ఆమె కండ్లల్లో ఆనందం చూసినట్టు నిందితులు చెప్పడం విస్మయానికి గురిచేస్తున్నది. సూర్యాపేట పట్టణంలోని మామిళ్లగడ్డకు చెందిన వడ్ల కొండ కృష్ణ (32) అదే పట్టణంలోని పిల్లలమర్రికి చెందిన భార్గవి ప్రేమించుకున్నారు. కృష్ణది ఎస్సీ సామాజిక వర్గం కాగా, భార్గవి బీసీ. వీరి పెండ్లికి భార్గవి కుటుంబం ఒప్పుకోలేదు. ఆరు నెలల క్రితం వీరిద్దరు పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నారు. దీంతో భార్గవి కుటుంబ సభ్యులు కృష్ణపై పగ పెంచుకున్నారు. ప్రధానంగా భార్గవి నాయనమ్మ కోట్ల బుచ్చమ్మ తన మనుమరాలు వద్దన్నా పెండ్లి చేసుకోవడంతో తరచూ మనుమండ్లను ఎగతాళి చేస్తూ మాట్లాడేది. వాడిని చంపితేనే మీరు సరైన మగాళ్లురా అంటూ వారిని ఉసి గొలిపేది. దీంతో భార్గవి సోదరులు కోట్ల నవీన్, వంశీ మరింత పగ పెంచుకొని కృష్ణను అంతమొందించాలని పథకం పన్నారు. స్నేహితుడైన బైరు మహేశ్ సహాయం తీసుకున్నారు. ఈ నెల 26న సాయంత్రం కృష్ణ తన స్కూటీపై మహేశ్ ఇంటికి రాగా ఇద్దరు కలిసి పిల్లలమర్రి శివారుకు వెళ్లి మందు తాగారు. మహేశ్ మద్యం తాగగా.. కృష్ణ కూల్‌డ్రింక్ మాత్రమే తీసుకున్నట్టు తెలిసింది. కొద్దిసేపటి తరువాత మహేశ్ పక్కకు వెళ్లి నవీన్, వంశీకి ఫోన్ చేసి రమ్మన్నాడు. ఇంటికి వెళ్లామని కృష్ణ స్కూటీ తీస్తుండగా మహేశ్ వెనుక కూర్చొని కృష్ణ గొంతుకు అడ్డంగా చేయి వేసి గట్టిగా నొక్కుతుండగా నవీన్, వంశీ పరుగెత్తుకొని వచ్చి రాళ్లతో కొట్టి హత్య చేశారు. హత్యానంతరం నవీన్ తన కారు డిక్కీలో కృష్ణ శవాన్ని ఉంచాడు. పాత సూర్యాపేటలో బంధువుల ఇంట్లో ఫంక్షన్‌లో ఉన్న వాళ్ల నాయనమ్మ దగ్గరికి తీసుకెళ్లి శవాన్ని చూపించారు.

12,500 లంచం తీసుకుంటూ..

ఏసీబీకి చిక్కిన లింగంపేట ఎస్సై

వినాయక్‌నగర్, జనవరి 29: నిజామాబాద్ మండలం బోర్గాం(పీ) వద్ద ఉన్న కార్ బజార్ నిర్వాహకుడు స్వామి చిరంజీవి అనే వ్యక్తికి కారును విక్రయించాడు. చిరంజీవి లోన్ డబ్బులు చెల్లించకపోవడంతో మొదటి యజమాని రాజేశ్‌కు నోటీసులు వచ్చాయి. దీంతో అతడు లింగంపేట ఎస్సై సుధాకర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు ఎస్సై కార్‌బజార్ నిర్వాహకుడికి ఫోన్ చేసి కేసు నమోదుకాకుండా ఉండడానికి 30 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో అతడు 12,500 ఇస్తానంటూ ఒప్పందం కుదుర్చుకొని, ఏసీబీని ఆశ్రయించారు. స్వామి ఎస్సైకి 12,500 ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

సహోద్యోగి నుంచి 15 వేలు లంచం

ఏసీబీకి చిక్కిన పశు వైద్యాధికారి

ఉట్నూర్ రూరల్, జనవరి 29: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం ఉద్యానాయక్ తండా పశు వైద్యాధికారి రాథోడ్ రమేశ్ బుధవారం 15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉద్యానాయక్‌తండా పశువైద్య కార్యాలయంలో వెటర్నరీ అసిస్టెంట్ జుగునాక మాధవ్‌రావు 6 నెలల క్రితం నార్నూర్‌కు బదిలీపై వెళ్లాడు. తనకు రావాల్సిన రెండు నెలల వేతనం మంజూరు చేయించాలని పశువైద్యాధికారికి విన్నవించగా లంచం డిమాండ్ చేశాడు. 15 వేలకు ఒప్పందం కుదిరింది. బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. రమేశ్ 15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ అదుపులోకి తీసుకున్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

చిట్యాల జనవరి 29 : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు బుర్ర శ్రీధర్ కుమార్తె నవ్య, సీనియర్ పాత్రికేయుడు సామల ధనుంజయ తండ్రి జగన్నాథం, తిరుమలాపూర్ గ్రామానికి చెందిన నాగి రెడ్డి కొమురయ్య ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, ఇతర నాయకులతో కలిసి బాధిత కుటుంబాలను బుధవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మడికొండ రవీందర్‌రావు, మాజీ ఎంపీటీసీ జంబుల తిరుపతి, బైరం భద్రయ్య, ఆరెపల్లి సమ్మయ్య, కంచర్ల కుమారస్వామి, కుస ప్రశాంత్‌రెడ్డి, కట్టెకోల్ల రాజు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

కాటారం, జనవరి 29 : నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవిరాథోడ్ హెచ్చరించారు. మండలకేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రులకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, బయోమెడికల్ వేస్టేజ్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. హాస్పిటల్స్‌ను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఆర్ఎంపీలు హాస్పిటల్ అని బోర్డు కాకుండా ప్రథమ చికిత్సాలయాలుగా బోర్డులు పెట్టుకోవాలని సూచించారు. ఆయన వెంట హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి, ఎంపీహెచ్ఈవో మురళీధర్, హెల్త్ అసిస్టెంట్స్ సుధీర్, రాజు, సమ్మయ్య ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ములుగురూరల్, జనవరి 29 : ములుగు జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో రోడ్డు భద్రత మహోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓఎస్డీ గీతే మహేశ్ బాబా సాహెబ్ హాజరై మాట్లాడారు. వానదారులు తప్పకుండా రోడ్ భద్రత నియమాలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, ఆర్టీవో శ్రీనివాస్, ఎస్సై వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగాలు ఇవ్వాలి

విలేకరుల సమావేశంలో వీఆర్ఏ సంఘం జేఏసీ జిల్లా చైర్మన్ చెన్నపురి హరీశ్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్

కృష్ణకాలనీ, జనవరి 29 : వీఆర్ఏ వారసులకు విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగాలు ఇవ్వాలని వీఆర్ఏల సంఘం జేఏసీ జిల్లా చైర్మన్ చెన్నపురి హరీశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరీశ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తాతలు తండ్రుల నుంచి వారసులుగా 20,555 మంది వీఆర్ఏలు ఉన్నారని, వీరికి గౌరవ వేతనం వచ్చేదన్నారు. అయితే వీరిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో నంబర్ 81,85 తీసుకువచ్చి 61యేళ్లలోపు ఉన్న 16,755మందికి విద్యార్హతలకు అనుగుణంగా పేస్కేలుతో ఉద్యోగాలిచ్చిందన్నారు. మిగతా 3,897మంది 61యేళ్ల పైబడి ఉండగా, వారికి కూడా త్వరలోనే నిర్ణయం తీసుకొని ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో అవి ఆగిపోయాయన్నారు.

కాగా ఎన్నికల సందర్భంగా 3,897మంది వీఆర్ఏల సమస్యలు పరిష్కరించి న్యాయం చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ హామీని మరిచిపోయిందన్నారు. తక్షణమే ప్రభుత్వం జీవో నం. 81, 85 ప్రకారం వీఆర్ఏ వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. లేదంటే పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్ఏ జేఏసీ వైస్‌చైర్మన్ గడ్డం రమేశ్, జనరల్ సెక్రటరీ భూతం రాజు, మధు, రమేశ్, సతీశ్, బోగి రాజుకుమార్, కర్ణ, మేనక తదితరులు పాల్గొన్నారు

ఎన్నికల కోసమే కాంగ్రెస్ ఎత్తుగడ

మహదేవపూర్, జనవరి 29 : స్థానిక సంస్థల ఎన్నికల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారుతుందని బీజేపీ మండలాధ్యక్షుడు రాంశెట్టి మనోజ్ ఆరోపించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డు, రైతు భరోసా నాలుగు ప్రభుత్వ సంక్షేమ పథకాలను గణతంత్ర దినోత్సవం రోజు అమలు చేస్తామని చెప్పి తర్వాత మండలానికి ఒక గ్రామానికే అనడం సరికాదన్నారు. ఇదంతా స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగానే హడావిడి తప్పా ప్రజలకు న్యాయం చేసే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు.

చిత్తశుద్ధి ఉంటే అన్ని గ్రామాల్లో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చిట్యాల/మహాముత్తారం, జనవరి 29 : ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన సూర సౌదయ ఇంటి వద్ద పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెపారు. అదే గ్రామానికి చెందిన పుట్టపాక రాజు, మహేందర్, సూర నరేందర్, గుర్రం హరీశ్, మాడాసు స్వామిదాసు, ఓదెల రాజేశ్, దేవుని లక్ష్మీపతి అనే పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. దాడుల్లో ఏఎస్సై ఈశ్వరయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, మహాముత్తారం మండలం సింగారంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై మహేందర్‌కుమార్ తెలిపారు. వారి నుంచి రూ.5340స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

భూములు కోల్పోతున్న రైతులతో ఆర్డీవో సమావేశం

మొగుళ్లపల్లి, జనవరి 29 : మండలంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే బేస్‌లో భూములు కోల్పోతున్న రైతులతో ఆర్డీవో రవి బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం అందిస్తున్న నష్టపరిహారం, భూమి విలువను పెంచడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ సునీత, ఆర్ఐ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూసార పరీక్షకు శాంపిల్స్ సేకరణ

వాజేడు, జనవరి 29 : యాసంగి పంటల సాగు నేపథ్యంలో భూసార పరీక్షలు చేసేందుకు అధికారులు బుధవారం శాంపిల్స్ సేకరించారు. ఏఈవోలు జాఫర్, హరీశ్‌లు జంగాలపల్లి, ప్రగళ్లపల్లి గ్రామాల్లో మట్టి శాంపిల్స్‌ను పరీక్ష చేయడానికి సేకరించారు. మండలానికి 333శాంపిల్స్ పరీక్ష చేయడానికి 20గ్రామాల్లో మట్టి శాంపిల్స్ సేకరించనున్నట్లు ఏఈవోలు తెలిపారు.

లబ్ధిదారుల ఎంపికలో మోసం

ములుగు రూరల్, జనవరి 29 : రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన నాలుగు పథకాలు ఎక్కడ అమలు కావడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలానికి ఒక గ్రామానికి పథకాలు ఇచ్చి 90శాతం అమలు అయినట్లుగా గొప్పలు చెప్పుకుని స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తలకే ఇండ్లు వచ్చే విధంగా ఇందిరమ్మ కమిటీలు పని చేస్తున్నాయన్నారు. భూక్యా జవహర్, విశ్వనాథ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రూ.రెండు లక్షలపైన రుణాలు మాఫీ చేయాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య

భూపాలపల్లి రూరల్, జనవరి 29 : రూ.రెండు లక్షలకు పైగా ఉన్న రైతుల రుణాలు కూడా త్వరిత గతిన మాఫీ చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి విజయ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. రాజయ్య మాదిగ మాట్లాడుతూ కొన్ని టెక్నికల్ కారణాల వల్ల చాలా మంది రైతులకు రూ.లక్ష రుణం కూడా మాఫీ జరుగక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే రుణమాఫీ చేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి శీలపాక హరీశ్‌మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్ల సతీశ్‌మాదిగ, మల్హర్ మండలం అధ్యక్షుడు మంత్రి రాజబాబు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్ర గాయాలు

వెంకటాపురం(నూగూరు), జనవరి 29 : వీరభద్రవరం గ్రామంలో ఇంటి నిర్మాణ పనికోసం వచ్చి విద్యుదాఘాతానికి గురికాగా ఒకరికి తీవ్రగాయలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గోర్లి గ్రామానికి చెందిన శేతుపతి వీర భద్రవరం గ్రామంలో ఇంటి నిర్మాణ పనుల కోసం వచ్చాడు. బుధవారం పని చేస్తుండగా ఇంటి పైనున్న విద్యుత్ లైన్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. సగభాగం వీపు కాలిపోవడంతో 108వాహనంలో వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ములుగు ఏరియా వైద్యశాలకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

నాలుగు రోజులు నిరంతర విద్యుత్ అందించాలి

జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

తాడ్వాయి, జనవరి 29 : ఫిబ్రవరి 12 నుంచి 15వరకు జరిగే మేడారం సమ్మక్కసారలమ్మల మినీ జాతరలో అంతరాయం లేకుండా నాలుగు రోజులపాటు నిరంతరంగా విద్యుత్‌ను అందించాలని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. మేడారంలో బుధవారం ఆయన పర్యటించి మినీ జాతరకు విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. మొదట అమ్మవార్లను దర్శించుకున్నారు. మినీ జాతర సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి పనులు త్వరతిగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట నోడల్ ఆఫీసర్ బీకాంసింగ్, ఎస్ఈ మల్సూర్‌నాయక్, డీఈ నాగేశ్వర్‌రావు, డీఈ సదానందం ఉన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి

ములుగు రూరల్, జనవరి 29 : రానున్న వేసవిలో అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేయాలని ఎన్పీడీసీఎల్ భూపాలపల్లి నోడల్ ఆఫీసర్ బీకాం సింగ్ కోరారు. ములుగులోని కార్యాలయంలో భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కార్యాచరణ ప్రణాళిక మేరకు సకాలంలో పనులు పూర్తి చేయించాలని సూచించారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వైద్యశాలలు, ఇతర అత్యవసర సర్వీసులకు ప్రత్యామ్నాయంగా సరఫరాకు ఇంటలింకింగ్ వ్యవస్థను పూర్తిగా పటిష్టం చేయాలన్నారు. విద్యుత్ అంతరాయాలను పరిష్కరించడానికి ఎమర్జెన్సీ టీం వాహనాలను ఉపయోగించాలని, వ్యవసాయ సర్వీసుల మంజూరు వేగవంతంగా చేయాలన్నారు. సమావేశంలో అధికారులు మల్సూర్‌నాయక్, డీఈ నాగేశ్వర్‌రావు, సదానందం పాల్గొన్నారు.

PVR ఆర్.కె - బంజారాహిల్స్ 4.55PM
PVR పెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 4.40PM
PVR ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 10.55PM
PVR నెక్టస్ మాల్ - కూకట్‌పల్లి 1.00PM
PVR గలేరియా - పంజాగుట్ట 7.55PM
PVR పివిఆర్ - ఎర్రమంజిల్ 11.00PM
PVR పివిఆర్ - మూసారంబాగ్ 10.55PM
PVR ప్రెస్టన్ ప్లైమ్ - గచ్చిబౌలి 1.35PM
PVR ఐకాన్ - హైటెక్ సిటీ 4.30PM
PVR ATRIUM మాల్ -గచ్చిబౌలి 7.05PM
PVR PRISM మాల్ - గచ్చిబౌలి 10.40PM
INOX ఐనాక్స్ - బంజారాహిల్స్ 10.15PM
INOX జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ 2.30PM
INOX పత్తనెక్టిస్ మాల్ - కవాడిగూడ 4.00PM
INOX అశోక ఎ/సి - వై.జంక్షన్ 1.40PM
Cinepolis లులు మాల్ - కూకట్‌పల్లి 2.40PM
Cinepolis CCPL - మల్కాజ్‌గిరి 1.15PM
Cinepolis డి.ఎల్.ఎస్ - ఉప్పల్ 1.15PM
Cinepolis మంత్రామాల్ - అత్తాపూర్ 4.55PM
Cinepolis సుధ - శాలిబండ 2.10PM
Cinepolis టీఎన్ఆర్ ఎ/సి - కొంపల్లి 4.20,11.00PM
అపర్ణ పినిమాస్ - నల్లగండ్ల 1.35PM
MOVIETIME ప్లాటినమ్ - అమీర్‌పేట 1.00PM
MOVIETIME ప్లాటినమ్ - గచ్చిబౌలి 12.00PM
ASIAN ఎంక్యూబ్ - అత్తాపూర్ 4.35PM
ASIAN పీవీఆర్ స్క్వేర్ - ఉప్పల్ 1.25,10.30PM
ASIAN ఎం.జె.ఆర్ - నారపల్లి 1.40PM
GPR జీపీఆర్ - కూకట్‌పల్లి 10.45AM
AMB ఎఎంబి - గచ్చిబౌలి 1.05PM
ఎఎఎ - అమీర్‌పేట్ 10.00,7.40PM
లక్ష్మీకళ - మూసాపేట్ 2.30PM
పీవీపీ ప్లానెట్ ఎ/సి - కొంపల్లి 10.40PM
AMR ఎఎంఆర్ - మౌలాలి 10.40AM
మీరజ్ పినిమాస్ - దిల్‌సుఖ్‌నగర్ 10.30PM
మీరజ్ పినిమాస్ - ఐడిపిఎల్ 4.40PM
మీరజ్ పినిమాస్ - చందానగర్ 10.30PM
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 4.20PM
లక్ష్మినరసింహా - మియాపూర్ 4.20PM
పినిమార్